క్లుప్తంగా

పోషకాహారం తీసుకోవాలి



పోషకాహార మహోత్సవంలో మాట్లాడుతున్న సీడీపీవో కల్యాణివర్మ

కొత్తపట్నం: గర్భిణులు, బాలింతలు పోషకాహారమైన చిరుధాన్యాలు తీసుకోవడం వలన వారికి వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని సీడీపీవో కల్యాణివర్మ తెలిపారు. ఈతముక్కల సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కోడ్ నంబర్ 8లో శనివారం పోషకాహార మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆర్.పిచ్చమ్మ అధ్యక్షత వహించగా, సీడీపీవో మాట్లాడుతూ ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల వరకు ప్రతి పిల్లవానికి పోషకాలు అందించే ఆహారం ఇవ్వాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రానికి ప్రతి రోజూ రావాలని కోరారు. ఏసీడీపీవో వై.అంజమ్మ మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే ప్రతి పిల్లవాని బరువు, ఎత్తు క్రమం తప్పకుండా తీసి మన రికార్డులో నమోదు చేయాలని కోరారు. అంగన్‌వాడీ సెంటర్‌లో అందించే సరుకులను ప్రతి బాలింత, గర్భిణి క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జ్యోతి, ఏఎన్‌ఎం జి.సుజాత, ఏఈవో నాగేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, అంగన్‌వాడీ ఆయాలు, ఆశా వర్కర్లు, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

అమ్మవారికి సబ్ కలెక్టర్ పూజలు

మార్కాపురం: మండలంలోని కుంట, కోలభీమునిపాడు గ్రామాల మధ్య ఉన్న ముద్దసానమ్మ గ్రామ దేవతకు శనివారం మార్కాపురం సబ్ కలెక్టర్ త్రివినాగ్, తహసీల్దార్ చిరంజీవి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందించారు. వారి వెంట రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

- చెరువుకొమ్ముపాలెం మురుగు మొత్తం పెళ్లూరు చెరువులోకి..
- ఊరచెరువు, ఇసుక వాగులో నుంచి వెళ్లాల్సిన మురుగు కూడా పెళ్లూరు చెరువులోకే...
- టీడీపీ స్థానిక నాయకుల అడ్డగోలు పనులకు ఒంగోలు కార్పొరేషన్ అధికారుల వత్తాసు
- టీడీపీ వర్గీయుల ఇళ్ల వద్ద డ్రైనేజీ ఒకరకంగా.. వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల ఇళ్ల వద్ద మరోరకంగా..
- కార్పొరేషన్ నిధులు బొక్కేయడంతో పాటు వైఎస్సార్ సీపీ వారిని వేధిస్తున్న టీడీపీ నాయకులు
- వేరే మార్గం లేక పెళ్లూరు చెరువులోకి మురుగును మళ్లిస్తున్నామంటున్న మున్సిపల్ ఇంజినీర్ ఏసయ్య



పెళ్లూరు చెరువులోకి మళ్లిస్తూ చెరువుకొమ్ముపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న మురుగు కాలువ



పెళ్లూరు చెరువులోకి వెళ్తున్న మురుగునీరు (చివరిన కనబడేదే పెళ్లూరు చెరువు)



టీడీపీ 18వ డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల రోశయ్య ఇంటి ముందు మురుగు కాలువను పూడ్చేసి నిర్మించిన బైక్ ర్యాంపు



టీడీపీ అనుచరుల ఇంటి గోడకు తగలకుండా రెండు నుంచి నాలుగు అడుగులు ఎడంగా నిర్మిస్తున్న మురుగు కాలువ

అధికార దుర్వినియోగం.. చెరువంతా మురుగుమయం..!

ఒంగోలు సబర్బన్: అధికార టీడీపీ నాయకులు, ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. పెళ్లూరు సాగు, తాగునీటి చెరువును మురుగుమయం చేస్తున్నారు. నాగార్జున సాగర్ నీటితో నిండిన పెళ్లూరు చెరువు అధికార టీడీపీ నాయకుల అక్రమాలకు, అవినీతికి మురుగుమయంగా మారిపోతోంది. ఇందుకు ఒంగోలు నగరపాలక సంస్థ 18వ డివిజన్‌కు కార్పొరేటర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న నగర మేయర్ సుజాత పరోక్షంగా, చెరువుకొమ్ముపాలెం టీడీపీ నాయకుడు, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల రోశయ్య ప్రత్యక్షంగా కారకులు కాగా, వీళ్లిద్దరికీ ఒంగోలు నగర కమిషనర్ వెంకటేశ్వరరావు, మున్సిపల్ ఇంజినీర్ ఏసయ్య మద్దతు పలుకుతున్నారు. దీనిపై అక్టోబర్ 1వ తేదీ సాక్షి దినపత్రికలో 'కూటమి నాయకుల బరితెగింపు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం విదితమే. అప్పటి నుంచి టీడీపీ నాయకులు, నగర పాలక సంస్థ అధికారులు మరీ బరితెగిస్తూ ముందుకుపోతున్నారు. నాగార్జున సాగర్ జలాలతో కళకళలాడుతున్న పెళ్లూరు చెరువును టీడీపీ నాయకులు, అధికారులు ఎందుకు మురుగుమయం చేయాలనుకుంటున్నారో అంతుబట్టడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

గ్రామంలో ఏటవాలు ప్రాంతాలను తుంగలో తొక్కి...

చెరువుకొమ్ముపాలెంలో మురుగు నీరు దక్షిణం, పడమర, ఉత్తరం వైపునకు ప్రవహించే అవకాశం ఉంది. ఒకప్పుడు గ్రామం ఏర్పడినప్పటి నుంచి మురుగు నీరు ఊర చెరువు, ఇసుక వాగు మీదుగా బయటకు వెళ్లేది. టీడీపీ నాయకులు వారి పొలాలకు మురుగు వెళుతుందనే ఉద్దేశంతో ఆ మురుగు నీటిని నాగార్జున సాగర్ నీటితో కళకళలాడుతున్న పెళ్లూరు చెరువుకు మళ్లించే కుట్రకు తెరలేపారు. అందుకు ఒంగోలు నగర పాలక సంస్థ ఇంజినీర్లు పూర్తిగా సహకరిస్తున్నారు.

అడ్డగోలుగా కాలువల నిర్మాణం...

చెరువుకొమ్ముపాలెంలో రూ.40 లక్షలతో మురుగు కాలువల నిర్మాణం చేపట్టారు. కాంట్రాక్టర్ ఒకరు కాగా, పనులు చేసేది మాత్రం చెరువుకొమ్ముపాలేనికి చెందిన టీడీపీ నాయకులే. అయితే, వైఎస్సార్ సీపీ నాయకులు, సానుభూతిపరుల ఇళ్ల వద్ద ప్రహరీలు సైతం కూల్చేసి మెట్లు పగలకొట్టి కాలువల నిర్మాణం చేపట్టారు. ఇష్టారాజ్యంగా సామాన్యులను కూడా వేధిస్తూ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టారు. కానీ, టీడీపీ నాయకులు, సానుభూతిపరుల ఇళ్ల వద్ద మాత్రం ప్రహరీలను తాకకుండా రెండు నుంచి నాలుగు అడుగుల దూరంగా డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. ఏకంగా టీడీపీ డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల రోశయ్య ఇంటి ముందు మురుగు కాలువ ఉన్నప్పటికీ దానిని పూర్తిగా మూసేశారు. దీంతో పాటు వాకిటి ముందు గేటుకు ఎదురుగా బైక్ ర్యాంపు కూడా నిర్మించి ఉన్నప్పటికీ తొలగించలేదు. అధికార పార్టీ కావడంతో అడిగే వాడు లేడనే ధీమాతో ఇలా చేయడంపై వైఎస్సార్ సీపీ నాయకుడు పూసపాటి సమర సింహారెడ్డి అడిగినందుకు ఒంగోలు తాలూకా పోలీసులతో గ్రామంలో హల్‌చల్ చేయించారు. అయినప్పటికీ పూసపాటి వెనక్కు తగ్గలేదు. అడ్డగోలుగా కాలువల నిర్మాణంపై పోరాటం చేస్తూనే ఉన్నాడు.



పెళ్లూరు చెరువులోకి వెళ్తున్న మురుగు, ప్లాస్టిక్ వ్యర్థాలు

ఇరిగేషన్ కాలువలోకి మురుగు కలపడం దుర్మార్గం



ఒంగోలు నగరపాలక సంస్థ ఇంజినీర్ ఏసయ్య నాకు సమాధానం పంపారు. కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఇచ్చిన అర్జీకి సమాధానం చెబుతూ.. వేరే గత్యంతరం లేకపోవడంతో పెళ్లూరు సాగు, తాగునీటి చెరువులోకి చెరువుకొమ్ముపాలెం మురుగు మొత్తం మళ్లించాల్సి వచ్చిందని సమాధానం పంపారు. సాగు, తాగునీటి చెరువు పట్ల అధికారులు చేయాల్సిన పని ఇదేనా. జిల్లా జాయింట్ కలెక్టర్ స్పందించి మున్సిపల్ ఇంజినీర్‌పై క్రిమినల్ కేసు పెట్టమన్నారు. ప్రజల సొమ్మును జీతంగా తీసుకుంటూ నాగార్జున సాగర్ జలాలతో కళకళలాడుతున్న పెళ్లూరు చెరువును మురుగుమయం చేస్తారా. ఇంతకన్నా దుర్మార్గం ఏమైనా ఉందా.

– పూసపాటి సమర సింహారెడ్డి (జాలిరెడ్డి), వైఎస్సార్ సీపీ నాయకుడు, చెరువుకొమ్ముపాలెం

జీఎస్టీపై అవగాహన అవసరం

సంతనూతలపాడు: మండలంలోని పలు రైతు సేవా కేంద్రాలలో సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్‌పై శనివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. మండల వ్యవసాయాధికారిణి పావని పాల్గొని మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతులంతా జీఎస్టీ తగ్గుదలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వ్యవసాయ యంత్రాలపై 18 శాతం నుంచి 13 శాతం వరకు, తుంపర సేద్యం పరికరాలపై 5 శాతం, డ్రిప్ ఇరిగేషన్ యంత్రాలపై 12 శాతం, సూక్ష్మ ఎరువులపై 12 శాతం జీఎస్టీ తగ్గిందని తెలిపారు. రైతులు వినియోగించుకోవాలని సూచించారు.

చీమకుర్తిలో...

చీమకుర్తి రూరల్: చీమకుర్తిలోని మండల వ్యవసాయ కార్యాలయంలో జీఎస్టీపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి డీవీ భాస్కర్ పాల్గొని మాట్లాడారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాఘవేంద్ర, ఉద్యానవనశాఖ అధికారిణి నాగలక్ష్మి, వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

జీఎస్టీ బ్రోచర్ ఆవిష్కరణ



జీఎస్టీ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ, కమర్షియల్ ట్యాక్స్ అధికారులు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు విద్యుత్ భవన్‌లో శనివారం సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ శాఖ జిల్లా ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, కమర్షియల్ ట్యాక్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ టి.భాస్కర్ ఆధ్వర్యంలో బ్రోచర్ ఆవిష్కరించారు. ఎంఎస్ఎంఈ సోలార్ ప్యానల్స్ ప్రదర్శన, జీఎస్టీ తగ్గడం వలన వినియోగదారులకు కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఈలు వీరయ్య, రఘుబాబు, ఎస్ఏఓ సుబ్బారావు, విజిలెన్స్ సీఐ నాయక్, డీఈఈ పాండురంగారావు, విద్యుత్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఆర్థికసాయం

చీమకుర్తి: ఆటో డ్రైవర్ల సేవ కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబు శనివారం వారి బ్యాంక్ ఖాతాలకు ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున నగదు జమచేసినట్లు సంతనూతలపాడు నియోజకవర్గ స్పెషలాఫీసర్ మాధవి, చీమకుర్తి మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య తెలిపారు. ఈ సందర్భంగా శనివారం చీమకుర్తి మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, నాలుగు మండలాల ఎంపీడీఓలు, ఏఎంసీ చైర్మన్ మన్నం రాజేశ్వరి ప్రసాద్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని తగలబెట్టడం దుర్మార్గం



నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘ నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపేట గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని తగలబెట్టడం దుర్మార్గమని, నిందితుడు సతీష్ నాయుడు, అతని అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలో శనివారం ఒంగోలు హెచ్‌సీఎం కళాశాల వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నీలం మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై, అంబేడ్కర్ విగ్రహాలపై వరుసగా జరుగుతున్న దాడులకు మోదీ మనువాద ప్రభుత్వమే కారణమన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని సమూలంగా మార్చబోతుందనేందుకు సంకేతాలన్నారు. బాపట్ల జిల్లా దేగర్లమూడివారిపాలెంలో టీడీపీ నాయకుల ఆదేశాల మేరకు అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించారని, అదేవిధంగా కనీసం చిత్రపటాన్ని ఏర్పాటు చేసుకునేందుకు కూడా పోలీసులు అనుమతించడం లేదని అన్నారు. సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి ప్రాతినిధ్యం వహిస్తున్న కొండపి నియోజకవర్గంలోని జరుగుమల్లి మండలం కలికవాయి బిట్రగుంట గ్రామంలోనూ అంబేడ్కర్ చిత్రపటం ఊరేగింపును టీడీపీకి చెందిన అగ్రవర్ణాలు అడ్డుకుంటే మంత్రి చర్యలు తీసుకోలేదన్నారు. కార్యక్రమంలో మాల్యాద్రి, శ్రీనివాసరావు, రమణయ్య, యానాది సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలు ఈకేవైసీ చేయించుకోవాలి



ఉపాధి హామీ కూలీలకు ఈకేవైసీ చేస్తున్న సిబ్బంది, పరిశీలిస్తున్న ఏపీడీ సుబ్బారావు

మద్దిపాడు: మండలంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలంతా ఈకేవైసీ చేయించుకోవాలని ఏపీడీ బసవ సుబ్బారావు తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీలో పనిచేస్తున్న జాబ్‌కార్డుదారులు ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, సీనియర్ మేట్లను కలిసి ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈకేవైసీ ద్వారా జాబ్ కార్డులను ఏ విధంగా పునరుద్ధరించాలన్న అంశంపై ఇప్పటికే సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. జాబ్‌కార్డులో ఉపాధి కూలీల వారీగా ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలన్నారు. మండలంలో 10,707 జాబ్‌కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయని, వారందరికీ ఈ నెల 31వ తేదీలోపు ఈకేవైసీ పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ ధనుంజయవర్మ, టెక్నికల్ ఇంజినీర్ కిషోర్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

దళిత నేతకు జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ



ధర్మేంద్రతో మాట్లాడుతున్న బూచేపల్లి వెంకాయమ్మ

తాళ్లూరు: మండలంలోని కొర్రపాటివారిపాలెం గ్రామానికి చెందిన దళిత నాయకుడు, వైఎస్సార్ సీపీ నేత సంఘం ధర్మేంద్ర ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ శనివారం ఆయన గృహానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని, ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మతో పాటు వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోశం మధుసూదన్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు కొర్రపాటి విష్ణు, ఉపాధ్యక్షుడు పులి ప్రసాద్‌రెడ్డి, ఆలోకం హరిబాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లోకిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, మండల పార్టీ నాయకులు కొర్రపాటి శరత్, గొళ్లపూడి ఎర్రయ్య, గువ్వల శ్రీనివాసరెడ్డి, లతీఫ్ (బచ్చా), యామర్తి ప్రభుదాస్, దేవదానం, జక్కుల రామకృష్ణ, గూడా గోపాల్‌రెడ్డి, నాగమల్లేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు షేక్ వలి, ముచ్చుమారి బ్రహ్మారెడ్డి, చిమట సుబ్బారావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న ఎస్సై అజయ్‌బాబు

సంతనూతలపాడు: రోజురోజుకీ పెరుగుతున్న సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై సమాజం అప్రమత్తంగా ఉండాలని సంతనూతలపాడు ఎస్సై అజయ్‌బాబు సూచించారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు శనివారం సంతనూతలపాడులో అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. సైబర్ నేరాల నివారణకు యువతీ, యువకులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచించారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు టోల్ ఫ్రీ నంబర్‌కుగానీ, సంబంధిత వెబ్‌సైట్లోగానీ ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే మాదక ద్రవ్యాల వినియోగం యువత భవితకు ఎంత ప్రమాదమో వివరించారు.

125 పశువులకు గాలికుంటు వ్యాధికి టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

సంతనూతలపాడు: మండలంలోని పేర్నమిట్ట పశువుల హాస్పిటల్లో 125 పశువులకు శనివారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పేర్నమిట్ట పశువుల హాస్పిటల్లో జిల్లా పశువైద్యాధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఒంగోలు డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ జగత్ శ్రీనివాస్, పేర్నమిట్ట పశువైద్యాధికారి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థినికి నగదు బహుమతి



దుర్గాభవానీకి నగదు అందిస్తున్న జై భీమ్ కమిటీ సభ్యులు

కొత్తపట్నం: మండలంలోని ఈతముక్కల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి నూజివీడు ట్రిపుల్ ఐటీ కాలేజీలో సీటు సాధించిన దుర్గాభవానీకి శనివారం ఈతముక్కల గ్రామంలోని అంబేడ్కర్ నగర్ జైభీమ్ కమిటీ సభ్యులు రూ.10,250 నగదును బహుమతిగా అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ చెంచు పున్నయ్య అధ్యక్షతన నిర్వహించిన అభినందన సభలో జైభీమ్ కమిటీ సభ్యుడు గడ్డం మురహరిరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దుర్గాభవాని ట్రిపుల్ ఐటీ కాలేజీలో సీటు సాధించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో దార్ల రంగనాయకులు, ఐనంపూడి నాగేంద్రం, మద్దిరాల శ్రీనివాసరావు, పసుమర్తి రమేష్, కాకి మాధవరావు, అల్లాడి ప్రభాకర్, స్వర్ణ లక్ష్మీనారాయణ, పురిమిట్ల విక్రమ్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం పాఠశాలలో పదో తరగతిలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.10 వేల నగదు బహుమతి అందిస్తామని జైభీమ్ కమిటీ సభ్యులు ప్రకటించారు.